రోడ్లు వేసేదెన్నడో ?

అస్తవ్యస్తంగా రహదారులు
- అవస్థలు పడుతున్న ప్రజలు
- కనీసం మరమ్మతులు చేపట్టని వైనం
- 25 కాలనీలకు ఇదే ప్రధాన రహదారి



ప్రభుత్వాసుపత్రి ఎదుట రోడ్డుపై నిలిచిన వరదనీరు

అల్వాల్: 25 కాలనీలకు ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. వాహనదారులు ఎప్పుడు.. ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డంతా నీటి గుంటలతో అల్వాల్ హిల్స్ హైటెన్షన్ రోడ్డు ప్రధాన రహదారి దుస్థితి ఇది.

వందలాది వాహనాల రాకపోకలు..

రోడ్డుకు ఇరువైపులా బహుళ అంతస్తు భవనాలు, అస్పత్రులు, వ్యాపార సముదాయాలు ఉండటం వల్ల నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు



గుంతలమయంగా మారిన రహదారి

సాగిస్తుంటాయి. తరచూ వాహనదారులు గుంతల్లో పడిపోవడం ప్రమాదాల భారిన పడటం జరుగుతూనే ఉంటాయి. ఈ విషయమై స్థానికులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పుడు తాత్కాలిక మరమ్మతులు చేపడుతుంటారు. కానీ రోడ్డు నిర్మాణం పూర్తిస్థాయిలో చేయకపోవడం వల్ల రోడ్డు అస్తవ్యస్తంగానే మిగిలిపోతుందని స్థానికులు వాపోతున్నారు.

ప్రముఖుల నివాసాలు ఇక్కడే..

ఈ ప్రాంతంలో ప్రధాన రాజకీయ పార్టీకి చెందిన సమీప బంధువుల నివాసాలు ఉండటంతో వారు తరచూ ఇక్కడికి రాకపోకలు సాగిస్తుంటారు. కానీ రోడ్డు నిర్మాణంపై ఆసక్తి చూపకపోవడంపై పలువురు విస్మయం చెందుతున్నారు.

వర్షం కురిసినప్పుడు బురదమయంగా..

ఓల్డ్ అల్వాల్ ప్రభుత్వాసుపత్రి వద్ద రోడ్డు నిర్మాణం కోసం తవ్వేశారు. కానీ రోడ్డు వేయడంలో అలసత్వం వహిస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం ఆసుపత్రికి వచ్చే రోగులు అవస్థలు పడుతున్నారు. అంబులెన్స్ సైతం ఆసుపత్రిలోకి రావాలంటే అవస్థలు పడాల్సి వస్తుందని విచారం వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురిసిన ప్రతిసారి ఈ ప్రాంతమంతా బురదకుంటగా మారడంతో ఇటువైపు రావడానికి జనం తీవ్ర అవస్థలు పడాల్సివస్తుందని, ఇప్పటికైనా అధికారులు రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలని కోరుతున్నారు.

రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు..



అల్వాల్ సర్కిల్ పరిధిలోని కొన్ని ప్రధాన రహదారుల ఏర్పాటుకు సీఆర్ఎంపీ ఫేస్–2 విభాగం ద్వారా నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాము. అవి మంజూరైతే రోడ్డు పనులు ప్రారంభమవుతాయి. 100 అడుగుల రోడ్డుతో పాటు ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేస్తాం.
– శ్రీకాంతి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

నిత్యం నరకమే..



ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే నిత్యం నరకం చూడాల్సి వస్తుంది. కళ్లు మూసి తెరిచేలోగా గుంతలో వాహనం పడిపోతుంది. రోడ్డుకి ఇరువైపులా ఫుట్‌పాత్‌ల ఆక్రమణతో రోడ్డు కుచించుకుపోవడంతో పాటు తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. 100 అడుగుల రోడ్డు నిర్మాణం పూర్తైతేనే సమస్య పరిష్కారం అవుతుంది.
– డి.వెంకటేష్, అల్వాల్

దశలవారీగా అభివృద్ధి పనులు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: దశలవారీగా అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మల్లాపూర్ డివిజన్ బ్రహ్మపురి కాలనీలో రూ.17 లక్షలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ, మీనానగర్‌లో రూ.3.5 లక్షలతో డ్రైనేజీ పనులకు స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అవసరమైన చోట డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామన్నారు, అనంతరం సీసీరోడ్లు వేయిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గం సమగ్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. జలమండలి మేనేజర్ సిరాజుద్దీన్, స్థానిక కాలనీవాసులు విశ్వరూపచారి, బేతాల మల్లేష్, నాగమల్లేష్, రవి, నర్సింహ్మా, బీఆర్ఎస్ నేతలు కుంటి కృష్ణ, తీగుల్ల శ్రీనివాస్‌గౌడ్, వాసుగౌడ్, ప్రవీణ్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'ఎన్ఎఫ్‌సీ'లో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది

కుషాయిగూడ: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ (ఎన్ఎఫ్‌సీ)లో కేంద్ర భద్రత బలగాలు సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి డీఏఈ–1 డీజీ ప్రణీత్‌చంద్ర, ఎన్ఎఫ్‌సీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ కోమల్‌కపూర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రక్తదానం మహాదానమని, మీరు చేసే రక్తదానం ఎంతో మంది జీవితాలను కాపాడుతుందన్నారు. ఈ సందర్భంగా సేకరించిన రక్తాన్ని తలసీమియా సికిల్ సెల్ సొసైటీకి అందజేయనున్నట్లు సీఐఎస్ఎఫ్ కమాండెంట్ రాహుల్‌సింగ్ గౌతమ్ తెలిపారు. 80 మంది సీఐఎస్ఎఫ్ సిబ్బంది శిబిరంలో పాల్గొని రక్తదానం చేసినట్లు వివరించారు. శ్యామ్, సంతోష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: 33/11కేవీ మల్లాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ స్టాండర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆదివారం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మల్లాపూర్ పారిశ్రామికవాడలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, మల్లాపూర్ ఏఈ నాగరాజు తెలిపారు.

ఉప్పల్: ఉప్పల్ పారిశ్రామికవాడ శ్రీకృష్ణ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ఉప్పల్ భగాయత్ ఏఈ కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అజంతాహోటల్, శ్రీకృష్ణ ఫార్మాలేన్, లక్ష్మీనారాయణ కాలనీ టెనెక్స్ పరిశ్రమ, ఏయిర్‌టెల్ కార్యాలయం, లక్ష్మీప్లాస్టిక్, శ్రీసాయికాలనీ రోడ్‌నెంబర్–1 నుంచి 3 వరకు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం



అల్వాల్: అల్వాల్ గోదాదేవి సమేత వేంకటేశ్వర ఆలయం, స్వయంబు ఆంజనేయ ఆలయం, ప్రసన్నాంజనేయ ఆలయం, సంజీవనీ హనుమాన్ ఆలయంలో శనివారం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఆలయ అర్చకులు దక్షిణామూర్తి శర్మ, మల్లికార్జునరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా పోచమ్మ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు



అల్వాల్: వెంకటాపురంలోని పోచమ్మ దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి గణపతిపూజ, అమ్మవారికి అభిషేకం, అర్చనలు, చండీయాగం నిర్వహించి, బలిహారం, మహాపూర్ణాహుతి, అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది.

పూడిక తీశారు.. మరిచారు !



ఎస్పీనగర్‌లో మ్యాన్‌హోల్స్ వద్ద తీసిన మట్టి

మల్కాజిగిరి: ఎస్పీనగర్‌లో మ్యాన్‌హోల్స్ వద్ద వారం రోజుల క్రితం జలమండలి సిబ్బంది పూడిక తీశారు. తీసిన పూడిక ఇప్పటి వరకు తొలగించకపోవడంతో దుర్గంధమైన వాసనతో ఇబ్బంది పడుతున్నామని, వెంటనే పూడిక తీసిన వ్యర్థాలను తొలగించాలని కోరుతున్నారు.

కరపత్రం ఆవిష్కరణ



మల్లాపూర్: 17న ఇందిరాపార్క్ వద్ద రజక వృత్తిదారుల సమస్యలపై జరగబోయే ధర్నాను విజయవంతం చేయాలని మేడ్చల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అంబటి చక్రపాణి, జ్యోతిఉపేందర్‌లు పిలుపునిచ్చారు. శనివారం నాచారం వార్డు కార్యాలయం వద్ద ధర్నా కరపత్రాన్ని ఆవిష్కరించారు. జిల్లా కమిటీ సభ్యులు సర్దార్ అశోక్‌రెడ్డి, రాజు, నర్సయ్య, భాస్కర్, బాలచందర్, జూపల్లి మైసయ్య, బాలరాజు, శ్యామ్, శ్రీనివాస్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ డివిజన్ బీజేపీ నూతన కార్యవర్గం

ఉప్పల్: డివిజన్ బీజేపీ నూతన కార్యవర్గాన్ని డివిజన్ అధ్యక్షుడు మారినేణి ఫణీందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా నాయకులు గోపు రమణారెడ్డి, సీనియర్ నాయకులు ధర్మారెడ్డి, బలవంత్‌చారీలు హాజరై నూతన సభ్యులను ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, శ్రీవాస్తవ్ భవిష్‌ప్రసాద్, గాజుల నాగరాజు, ప్రధాన కార్యదర్శులుగా తీగ విఠల్‌రావు, నామ శ్రవణ్, కోశాధికారిగా దువ్వాల రమేష్, కార్యదర్శులుగా బసవరాజు, శ్రీనివాస్‌ముదిరాజ్, పరుశురాం, స్వామిగౌడ్‌లను ఎన్నుకున్నారు.



మౌలిక వసతులు కల్పించాలని వినతి



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో గంగపుత్ర సంఘం సభ్యులు



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న జగదీష్‌గౌడ్, కాలనీవాసులు

గౌతంనగర్: డివిజన్ మల్లికార్జుననగర్‌లోని గంగపుత్ర సంఘానికి పవర్‌బోర్, మౌలిక వసతులు కల్పించాలని శనివారం గంగపుత్ర సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే గంగపుత్ర సంఘానికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారన్నారు. బీఆర్ఎస్ నేతలు మేకల రాముయాదవ్, గంగపుత్ర సంఘం ప్రతినిధులు బాలయ్య, ఐలయ్య, బిలయ్య, విశ్వనాథ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీనగర్ ప్రాథమిక పాఠశాలలో వసతుల లేమి..

మల్కాజిగిరి: సర్దార్ పటేల్‌నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో వసతులు కల్పించాలని స్థానికులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే మర్రిరాజశేఖర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా జగదీష్‌గౌడ్ మాట్లాడుతూ.. తమ ప్రాంతంలో పేద, మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా నివాసం ఉంటున్నారని, స్కూల్‌తో పాటు అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు కనీస వసతులు కల్పించాలని కోరామన్నారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. లక్ష్మణ్‌రావు, రాములు, శ్రీనివాస్‌గౌడ్, అశోక్‌గౌడ్, సునీత, వసంత, శ్రీకాంత్ పాల్గొన్నారు.

తడి,పొడి చెత్తను వేరు చేయాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న కాలనీవాసులు

బోడుప్పల్: ఇంటి యజమానులు తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటోలకు అందించాలని బోడుప్పల్ కమిషనర్ శైలజ అన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా శనివారం 19వ డివిజన్‌లో బృందావన్‌కాలనీలో స్థానిక కాలనీవాసులకు తడి చెత్త, పొడి చెత్తపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యర్థాలను ఖాళీస్థలాలు, రోడ్లపై వేయకుండా పరిశుభ్రతను పాటించాలన్నారు. డెంగీ వ్యాధి ప్రబలకుండా ఉండేందుకు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఘనంగా ఉజ్జయనీ మహంకాళి ఆలయ వార్షికోత్సవం

మల్కాజిగిరి: మల్కాజిగిరిలోని ఉజ్జయనీ మహంకాళి ఆలయం 23వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. శనివారం ఉదయం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, సామూహిక కుంకుమార్చన, దుర్గాహోమం, పూర్ణాహుతి, ప్రసాదవితరణ జరిగింది. ఆషాడమాసంలో అమ్మవారికి నిర్వహించే బోనాల జాతర కరపత్రాలను విడుదల చేశారు. జూలై 6 నుంచి 19వ తేదీ వరకు ఘటం ఊరేగింపు, 20న జాతర, 21న రంగం కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు ప్రకటించారు.



బోనాల జాతర కరపత్రాన్ని ఆవిష్కరించిన ఆలయ కమిటీ సభ్యులు

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ గీత, అధికారులు

ఉప్పల్: డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలో చేపట్టిన సీసీరోడ్ల నిర్మాణ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ అధికారులు ఈఈ హరిలాల్, డీఈ వెన్నెల, ఏఈ రాధిక స్థానికులతో కలిసి కార్పొరేటర్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, బీఆర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



ఉప్పల్ మినీ శిల్పారామంలో ప్రదర్శనతో కళాకారులు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో శనివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. డాన్స్ టీచర్ శ్రావణిప్రియ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో మహాగణపతి, కొలువైతివారంగా సాయి, చక్కని తల్లికి, మాధవాకేశవా, జతిస్వరం, మండూక శబ్దం, రామాయణ నృత్య రూపకం తదితర అంశాలను కళాకారులు ప్రదర్శించి మెప్పించారు. ప్రముఖ నాట్యగురువు కళానిపుణశ్రీ రవి కూచిపూడి హాజరై కళాకారులు అభినందించారు.

'అమ్మ పేరున ఓ మొక్కను నాటండి'



మొక్కను నాటుతున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: అమ్మ పేరున ఓ మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. ప్రధాని పిలుపు మేరకు బీజేపీ నాయకుడు సాయి న్యూవిద్యానగర్‌లో నిర్వహించిన 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. అమ్మ ప్రేమకు గుర్తుగా ప్రధానమంత్రి ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమం చాలా గొప్పదని, అమ్మలానే చెట్టు కూడా ప్రేమను అందిస్తుందని ప్రతి ఒక్కరూ మొక్కను నాటాలని సూచించారు. మాజీ కౌన్సిలర్ లీలావతి, శ్రీనివాస్, జైకృష్ణ, నందు, గోపి, అరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.

శానిటేషన్‌పై ఆగ్రహం..

మల్కాజిగిరి డివిజన్‌లో శానిటేసన్ అధ్వాన్నంగా మారిందని, కొన్నిచోట్ల శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లు సరిగ్గా పనిచేయడం లేదన్నారు. న్యూ విద్యానగర్ ప్రాంతంలో ఎస్ఎఫ్ఏ గోవిందమ్మపై పలుసార్లు ఫిర్యాదులు వచ్చాయని సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు.

ఆరోగ్యానికి యోగా దివ్య ఔషధం

రామంతాపూర్ : సంపూర్ణ ఆరోగ్యానికి యోగా సాధన ఒక దివ్య ఔషధం లాంటిదని, యోగా అసోసియేషన్ ఆఫ్ ఇండియా శాశ్వత ప్రతినిధి యోగా గురువు బొడ్డు రవీందర్ అన్నారు. శనివారం రామంతాపూర్ నెహ్రూనగర్ కమ్యూనిటీ హాల్‌లోని యోగా కేంద్రంలో నిర్వహించిన అభ్యాసకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 12 ఏళ్లుగా నిరంతరంగా యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని 16 నుంచి నెలరోజుల పాటు ఉచిత యోగా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల వారు 9246222889.

నూతన డ్రైనేజీ లైన్‌ను ఏర్పాటు చేస్తాం



కార్పొరేటర్ శాంతికి వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

మల్లాపూర్: నాచారం సాయినగర్‌కాలనీ, వైజయంతి థియేటర్ వెనకాల నూతనంగా డ్రైనేజీ లైన్‌ను ఏర్పాటు చేస్తామని కాలనీవాసులకు నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ హామీ ఇచ్చారు. గత కొంతకాలంగా డ్రైనేజీ ఓవర్ ఫ్లోతో కాలనీలో నడవలేని పరిస్థితి నెలకొందని కోరుతూ.. శనివారం నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. రూపరెడ్డి, జ్యోతిరెడ్డి, జాన్సీ, సుజాత, రాధ, స్వప్న, శ్వేత, శోభ తదితరులున్నారు.

గద్దర్ అవార్డుకు ఫొటో ముద్రించాలి

అల్వాల్: గద్దర్ పేరున అవార్డులు ఇస్తూ.. ఆయన ఫొటో పెట్టకపోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని గద్దర్ అభిమానుల సంఘం అధ్యక్షుడు సీఎల్.యాదగిరి ఓ ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నగరంలో గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవానికి సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ అవార్డుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, టీఎఫ్‌డీసీ చైర్మన్ దిల్‌రాజుల ఫొటోలు ఉన్నాయని, గద్దర్ పేరున అవార్డులు ఇస్తూ.. ఆయన ఫొటో పెట్టలేదని ఆరోపించారు.

కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్

కుషాయిగూడ: కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్‌లు చక్కటి వేదికలని జిల్లా న్యాయసేవాధికారసమితి జిల్లా కార్యదర్శి జస్టిస్ కిరణ్‌కుమార్ అన్నారు. కుషాయిగూడలోని మల్కాజిగిరి జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన జాతీయ లోక్‌అదాలత్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఎస్.ఎన్. శ్రీదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 2 లక్షల పెండింగ్ కేసుల పరిష్కారానికి 19 బెంచ్‌లను ఏర్పాటు చేసినట్లు వారు వివరించారు. జిల్లా వ్యాప్తంగా 525 సివిల్, 1,80,551 అన్ని రకాల కేసులతో పాటుగా 35 ప్రీ లిటిగేషన్ కేసులకు పరిష్కారంతో 1,84,88,617 రూపాయాల పరిహారం అందజేశారు. న్యాయమూర్తి తిరుపతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కు బారులు !

మౌలాలి: డివిజన్‌లోని పలు ప్రాంతాల్లోని రేషన్ షాపుల వద్ద నిత్యావసర వస్తువుల కోసం ప్రజలు నిత్యం బారులు తీరుతున్నారు. మూడు నెలల రేషన్ ఒకేసారి ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించి వారాలు గడుస్తున్నా.. సర్వర్ మొరాయింపు, సాంకేతిక లోపాలను సరిచేయకపోవడంతో గంటల తరబడి లబ్ధిదారులు క్యూలైన్లలో రేషన్‌షాపుల వద్ద నిల్చునే పరిస్థితి దాపురించిందని వినియోగదారులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి సర్వర్ సమస్యను పరిష్కరించి రేషన్ ఇక్కట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.